
సాక్షి
బాపట్ల
సోమవారం । 16 । సెప్టెంబర్ । 2024




సాగునీటి సమాచారం

తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల): కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద ఆదివారం 4012, కొమ్మమూరు కాలువకు 1891 క్యూసెక్కుల చొప్పున వదిలారు.



పర్యాటకుల సందడి

విజయపురిసౌత్: నాగార్జునకొండను ఆదివారం భారీగా పర్యాటకులు సందర్శించారు. లాంచీల ద్వారా రూ.61,750 ఆదాయం సమకూరినట్లు లాంచీ యూనిట్ అధికారులు తెలిపారు.



పులిచింతలలో నీటి నిల్వ

అచ్చంపేట: పులిచింతల ప్రాజెక్టు నుంచి రెండు గేట్లను 2 మీటర్లు ఎత్తు లేపి 50,986 క్యూసెక్కులు వదులుతున్నారు. ఎగువ నుంచి 58,788 క్యూసెక్కులు వచ్చి చేరుతోంది.

న్యూస్‌రీల్

నేటి ప్రజా సమస్యల పరిష్కార వేదిక రద్దు

బాపట్ల టౌన్: ప్రతి సోమవారం జిల్లా ఎస్పీ కార్యాలయంలో నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం తాత్కాలికంగా రద్దు చేస్తున్నట్లు ఎస్పీ తుషార్‌డూడీ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 16వ తేదీన మిలాద్ ఉన్ నబీ సందర్భంగా వేదికను రద్దు చేసినట్లు పేర్కొన్నారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చే ఫిర్యాదుదారులు ఈ విషయాన్ని గమనించాలన్నారు.

భగ్గుమంటున్న ఉల్లి ధరలు



భట్టిప్రోలు: ఉల్లి ధరలు పెరగడంతో కొనుగోలుదారులు ఇబ్బంది పడుతున్నారు. ఇటీవల వరకు రూ.30 ఉన్న కిలో ధర రోజురోజుకీ పెరుగుతుండటంతో సామాన్యులు కొనాలంటే భయపడుతున్నారు. ప్రస్తుతం మార్కెట్‌లో కిలో రూ.70గా ఉంది. కొందరు బడా వ్యాపారులు కృత్రిమ కొరత సృష్టించి ఇలా ధరలు పెంచుతున్నారని వినియోదారులు ఆరోపిస్తున్నారు. ఇంత పెట్టినా నాణ్యమైన ఉల్లి దొరకడం లేదు. నీరు లేక ఎండిపోయి, కుళ్లిపోయిన ఉల్లిపాయలు మాత్రమే విక్రయిస్తున్నారని వినియోగదారులు వాపోతున్నారు.

బాలికపై యువకుడి లైంగిక దాడి

పిట్టలవానిపాలెం(కర్లపాలెం): అభం శుభం తెలియని ఓ మైనర్‌పై యువకుడు లైంగిక దాడి చేశాడు. ఈ దారుణం పిట్టలవానిపాలెం మండలంలోని చోడిపాలెం గ్రామంలో శనివారం రాత్రి చోటుచేసుకుంది. చందోలు ఎస్‌ఐ ఆర్ స్వామి శ్రీనివాస్ ఆదివారం తెలిపిన వివరాల మేరకు.. చోడిపాలెం గ్రామం ఎస్సీ కాలనీకి చెందిన డొక్కా రమేష్ అదే ప్రాంతంలో ఉంటున్న 8 సంవత్సరాల బాలికకు మాయ మాటలు చెప్పి డాబాపైకి తీసుకెళ్లి అత్యాచారం చేశాడని తెలిపారు. బాలిక ఏడుస్తూ కిందకు రావడంతో రమేష్ తల్లి చూసిందని పేర్కొన్నారు. బ్లీడింగ్ అవుతుండటంతో నీటితో శుభ్రం చేసిందన్నారు. అనంతరం ఆ బాలిక తన ఇంటికి వెళ్లి జరిగిన విషయం తల్లికి చెప్పటంతో వారు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు ఎస్‌ఐ చెప్పారు. నిందితుడిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు వివరించారు. బాలికను వైద్య పరీక్షల నిమిత్తం బాపట్ల ఏరియా వైద్యశాలకు తరలించామని తెలిపారు. ప్రస్తుతం ఆమె ఆరోగ్యం నిలకడగా ఉందని వైద్యులు చెప్పారని పేర్కొన్నారు.

పలువురు డీఎస్పీలు బదిలీ

నగరంపాలెం: రాష్ట్రవ్యాప్తంగా ఆదివారం 47 మంది డీఎస్పీలను బదిలీ చేస్తూ డీజీపీ సీహెచ్. ద్వారక తిరుమలరావు ఉత్తర్వులు జారీ చేశారు. గుంటూరు రేంజ్‌లో గుంటూరు, పల్నాడు జిల్లాలోని పలువురు డీఎస్పీలకు స్థానచలనం కలిగించారు. గుంతకల్లు డీఎస్పీ షేక్ అబ్దుల్ అజీజ్‌ను గుంటూరు తూర్పు సబ్ డివిజన్ డీఎస్పీగా, వెయిటింగ్‌లోని డీఎస్పీ ఎం.రమేష్‌ను గుంటూరు ట్రాఫిక్ డీఎస్పీగా, పీసీఎస్అండ్ఎస్ డీఎస్పీ ఎం.హనుమంతరావును పల్నాడు జిల్లా సత్తెనపల్లి డీఎస్పీగా నియమించారు. సత్తెనపల్లి డీఎస్పీ జి.గురునాథబాబును పోలీస్ ప్రధాన కార్యాలయంలో రిపోర్ట్ చేయాలని ఆదేశించారు. ఎమ్మిగనూరు డీఎస్పీ బి.సీతారామయ్యను గుంటూరు ఎస్బీ డీఎస్పీగా, పల్నాడు జిల్లా ఉమెన్ పీఎస్ డీఎస్పీ బి.ప్రసాద్‌ను చంద్రగిరి డీఎస్పీగా బదిలీ చేశారు.

ఆర్టీసీ బస్సుకు త్రుటిలో తప్పిన పెను ప్రమాదం

భయభ్రాంతులకు గురైన ప్రయాణికులు



తాడేపల్లి రూరల్: ఆర్టీసీ బస్సుకు త్రుటిలో పెను ప్రమాదం తప్పిన ఘటన ఆదివారం ఈమని వద్ద జరిగింది. తెనాలి డిపోనకు చెందిన ఆర్టీసీ బస్సు ఒక్కసారిగా ఈమని వద్ద పంట పొలాల్లోకి దూసుకు వెళ్లడంతో ప్రయాణికులు ఉలిక్కిపడ్డారు. పంట కాలువ గోతిలోకి వెళ్లి పడకుండా నిలిచిపోవడంతో ప్రయాణికులతో పాటు సిబ్బంది ఊపిరి పీల్చుకున్నారు. సేకరించిన వివరాల ప్రకారం.. తెనాలి డిపో నుంచి ఈమని మీదుగా బస్సు వల్లభాపురం వెళుతోంది. దుగ్గిరాల మండలం ఈమని దాటగానే స్టీరింగ్‌కు, టైర్లకు మధ్య లింక్ ఊడిపోయింది. దీంతో బస్సు కంట్రోల్ కాక కుడివైపునకు పంట పొలాల్లో ఉన్న గోతిలోకి వేగంగా వెళ్లింది. ముందు చక్రాలు బోదిలో ఇరుక్కుపోయాయి. వెనుక చక్రాలు ఐదు అడుగుల వరకు పైకి లేచాయి. ఆ సమయంలో 10 మంది మాత్రమే ప్రయాణికులు ఉన్నారు. ఆ రహదారిలో వెళ్లేవారు స్పందించి వారిని బయటకు దించారు. బస్సు నిదానంగా వెళ్లడంతో ప్రమాదం తప్పిందని, ఇదంతా తమ అదృష్టమని పలువురు ప్రయాణికులు వ్యాఖ్యానించారు.

సేవలపై శీతకన్ను

నేత్ర పరీక్షల కేంద్రాలకు కూటమి సర్కారు ఎసరు

- ముఖ్యమంత్రి ఈ–ఐ కేంద్రాలలో సేవలు నిలిపివేత
- పరీక్షలు, కళ్లజోడు నమోదు ప్రక్రియకు బ్రేక్
- ప్రభుత్వ అసమర్థతకు 'అద్దం' పడుతున్న వైనం
- నిధులు, సిబ్బందిని సమకూర్చి ఈ–ఐ కేంద్రాలకు జవసత్వాలు నింపిన గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం
- కూటమి ప్రభుత్వ నిర్ణయంతో నేత్ర రుగ్మతల బాధితుల అవస్థలు
- సిబ్బందికి ఉద్వాసన పలికేందుకు రంగం సిద్ధం!

పేదల కష్టనష్టాలు పట్టించుకోని కూటమి ప్రభుత్వం.. వారికి అందే సాయం, సేవలపైనా శీత 'కన్ను' వేసింది. సాయమో.. రామ 'చంద్రా'.. అంటూ ఎదురుచూస్తున్న పేదల వైపునకు 'చూపు' తిప్పని సర్కారు పెద్దలు.. వారికి అందే వైద్యసేవలను ఏ విధంగా అడ్డుకోవాలనే విషయంపై మాత్రం 'దృష్టి' పెట్టారు. తాజాగా పేదలకు కంటి వైద్యపరీక్షలు, అద్దాలు ఉచితంగా అందించే సీఎం ఈ–ఐ కేంద్రాల్లో సేవలు నిలిపివేయడమే కాకుండా.. వాటిని శాశ్వతంగా మూసివేసేందుకు ప్రభుత్వం పావులు కదుపుతోంది.



రోగులకు కంటి వైద్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది (ఫైల్)

బెల్లంకొండ: పేద ప్రజలకు అత్యాధునిక యంత్రాలతో నేత్ర పరీక్షలు చేసి, ఉచితంగా కళ్లజోళ్లు అందించే ముఖ్యమంత్రి ఈ–ఐ కేంద్రాలకు కూటమి సర్కారు మంగళం పాడేందుకు సిద్ధమైంది. సంక్షేమ పథకాల అమలుపై ఎన్నికల ముందు బీరాలు పలికిన కూటమి నేతలు... అధికారంలోకి వచ్చి నాలుగు నెలలైనా వాటి ఊసే ఎత్తడం లేదు. ఇచ్చిన హామీలు, పథకాలు అమలు చేయకపోగా.. గత ప్రభుత్వ పథకాలు, కార్యక్రమాలకు మంగళం పాడడంలో మాత్రం ముందుంటున్నారు. 2017లో ముఖ్యమంత్రి ఈ–ఐ కేంద్రాలను అప్పటి టీడీపీ ప్రభుత్వం ప్రారంభించినా, వెంటనే అమలులో చేతులెత్తేసింది. 2019లో అధికారం చేపట్టిన వైఎస్ జగన్ ప్రభుత్వం పేదలకు మేలు చేసేలా ముఖ్యమంత్రి ఈ–ఐ కేంద్రాలకు నిధులు, సిబ్బందిని కేటాయించి జవసత్వాలు నింపింది. అయితే ప్రస్తుత కూటమి సర్కారు అధికారం చేపట్టి మూడు నెలలు గడవక ముందే ఈ సేవలను నిలిపివేసింది. దీంతో నేత్ర పరీక్షలు చేయించుకోలేక, కళ్లజోళ్లు పొందే అవకాశం లేక పేద, మధ్యతరగతి ప్రజలు అవస్థలు పడుతున్నారు.

జిల్లావ్యాప్తంగా ఆరు సీహెచ్‌సీలలో...

ప్రతి ఒక్కరికీ నేత్ర పరీక్షలు చేసి, ఉచితంగా కళ్లజోళ్లు అందించేందుకు ప్రతి నియోజకవర్గంలో 30 పడకల ఆసుపత్రి (సీహెచ్‌సీ)లో ముఖ్యమంత్రి ఈ – ఐ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. పల్నాడు జిల్లా వ్యాప్తంగా సత్తెనపల్లి, చిలకలూరిపేట, వినుకొండ, మాచర్ల, అమరావతి, గురజాల సీహెచ్‌సీలలో ఈ కేంద్రాలు నడుస్తున్నాయి. కంటి పరీక్షలు చేసేందుకు ఫండస్ మిషన్, ఏఆర్ మిషన్లను ఏర్పాటు చేశారు. అదేవిధంగా ప్రతి సీహెచ్‌సీలో ఒక ఆప్తాలిక్ అసిస్టెంట్, ఒక టెక్నీషియన్‌ను నియమించారు. వీరు యంత్రాల సాయంతో కంటి పరీక్ష నిర్వహించి, అద్దాలు అవసరమైన వారి వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేస్తారు. రెండు వారాల్లో రోగులకు కళ్ల అద్దాలు కూడా అందజేస్తారు.

గతంలో కంటి 'వెలుగులు'..

నేత్ర సంబంధిత సమస్యలతో బాధపడే వారికి ఉచిత వైద్యం అందించాలని, పేద రోగులపై శ్రద్ధతో గత ప్రభుత్వంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైఎస్సార్ కంటి వెలుగు పథకాన్ని తెచ్చారు. ఈ కేంద్రాలను కూడా కొనసాగించారు. ఈ పథకాన్ని 2017లో అప్పటి టీడీపీ ప్రభుత్వం ప్రవేశపెట్టి, కొద్ది రోజులకే నిలిపివేసింది. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఐదేళ్లలో వేల సంఖ్యలో కంటి పరీక్షలు చేసి, ఉచితంగా అద్దాలు అందించింది. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా ప్రతి గ్రామంలో నిర్వహించిన వైద్య శిబిరంలో సిబ్బంది పాల్గొని విశిష్ట సేవలు అందించారు. పరీక్షల అనంతరం అవసరమైన వారికి రెండు వారాల్లో కళ్లజోళ్లను నేరుగా ఇంటి వద్దే అందించారు.

నిలిచిపోయిన సేవలు

గ్రామీణ ప్రాంత ప్రజలకు, ముఖ్యంగా పేదలకు కంటి వైద్య సేవల ద్వారా మేలు చేసే ముఖ్యమంత్రి ఈ–ఐ కేంద్రాల సేవలు కొద్ది రోజులుగా నిలిచిపోయాయి. జిల్లాలోని ప్రతి కమ్యూనిటీ హెల్త్ సెంటర్లో రోజుకు దాదాపుగా 30 మంది వరకు ఓపీ నమోదు చేసుకుని సేవలు పొందుతుంటారు. కానీ సీఎం ఈ–ఐ కేంద్రాలలో ప్రస్తుత ప్రభుత్వం సేవలను నిలిపేసింది. దీంతో నేత్ర రుగ్మతలతో బాధపడే వారంతా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రైవేటు ఆస్పత్రులకు వెళ్లే స్తోమత లేక ఆరోగ్యపరంగా ఇబ్బందులతో సతమతం అవుతున్నారు.

ఉద్యోగుల్లో ఆందోళన

ముఖ్యమంత్రి ఈ–ఐ కేంద్రాల్లో నేత్ర పరీక్షలు చేసి, ఇతర సేవలు అందించేందుకు రాష్ట్రంలో 250 మందికి పైగా ఉద్యోగులను 2017లోనే ఓ ప్రైవేట్ ఏజెన్సీ ద్వారా నియమించారు. వీరంతా వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలోనూ కొనసాగారు. పల్నాడు జిల్లాలో సుమారుగా 15 మంది సిబ్బంది పనిచేస్తున్నారు. ప్రైవేట్ ఏజెన్సీ ద్వారా కుదిరిన ఒప్పందం ఈ వారంలో ముగిసింది. ప్రస్తుత కూటమి ప్రభుత్వం కాంట్రాక్ట్‌ను రెన్యువల్ చేయకుండా కేంద్రాల మూసివేతకు సిద్ధమైంది. ఏడేళ్లుగా ఉన్న ఉద్యోగుల కొనసాగింపుపై మాట్లాడకపోవడంతో వారిలో ఆందోళన మొదలైంది.

ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాం



ప్రస్తుతం ముఖ్యమంత్రి ఈ–ఐ కేంద్రాల్లో పరీక్షలు, ఆన్‌లైన్‌లో అద్దాల నమోదు చేసే ప్రక్రియ నిలిచిపోయింది. ఈ సమస్యను ఉన్నతాధికారులు ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లారు. గతంలో కంటి వైద్య పరీక్షలు చేసుకున్న వారికి అద్దాలు రాగానే పంపిణీ చేస్తాం. ఈ కేంద్రాల్లో పనిచేస్తున్న సిబ్బందిని ప్రభుత్వం రెన్యువల్ చేయాల్సి ఉంది. తగిన అనుమతులు రాగానే తిరిగి సేవలను కొనసాగిస్తాం.

– డాక్టర్ మంత్రూ నాయక్, డీసీహెచ్ఎస్, పల్నాడు జిల్లా

పనులు పూర్తి చేయాలి



మెడికల్ కళాశాలలకు సంబంధించి రాష్ట్ర వైద్యశాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ చేసిన వ్యాఖ్యల్లో ఎలాంటి వాస్తవం లేదు. బాపట్ల మెడికల్ కళాశాలకు గతంలోనే రూ.550 కోట్ల నిధులు మంజూరు అయ్యాయి. రూ.150 కోట్లతో నిర్మాణ పనులు వేగంగా సాగాయి. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత ఆ పనులను నిలుపుదల చేసి చోద్యం చూస్తున్నారు. ఇకనైనా మిగిలిన పనులను వెంటనే పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలి. ఎంతో మందికి వైద్య సేవలతోపాటు మెడికల్ విద్యార్థులను తీర్చిదిద్దే కళాశాలను నిర్వీర్యం చేసే కుట్రలు మానుకోవాలి.

– జోగి రాజా, దళిత సంఘం నాయకుడు, బాపట్ల



ప్రైవేటుపరం చేయడం తగదు



పేదలకు వైద్య విద్యను చేరువ చేసే లక్ష్యంతో గత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైద్య కళాశాలలను భారీగా మంజూరు చేయించారు. పనులు కూడా ప్రారంభించారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం వైద్యవిద్యను నీరుగార్చుతూ ప్రైవేటుపరం చేయాలని చూడటం బాధాకరం. వైద్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ కళాశాలలపై చేసిన ప్రకటన హాస్యాస్పదం. జిల్లాకు ఒక వైద్య కళాశాలను ప్రభుత్వం పూర్తి చేసి, పేద విద్యార్థులకు వైద్య విద్యను మరింత చేరువ చేయాలి.

– దాది శంకర్, రేపల్లె

గుండెలు అదురుతున్నాయ్..!

మారుతున్న కాలంలో కొందరు ప్రతి దానికీ డీజే బాక్సులు ఉపయోగిస్తున్నారు. వాటి హోరుతో ప్రజల గుండెలు అదురుతున్నాయి. వినికిడి లోపాలు, మానసిక రుగ్మతలు, అసౌకర్యం వంటి సమస్యలు తలెత్తుతున్నా కార్యక్రమాల నిర్వాహకులు లెక్కచేయడం లేదు. నిబంధనలు కాగితాలకే పరిమితం కావడంతో ఇకనైనా అమలు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

- పెరిగిపోతున్న డీజే బాక్సుల వినియోగం
- చెవులకు చిల్లులు పడేలా అత్యుత్సాహం
- అధిక శబ్దాలతో తప్పని కాలుష్య కాటు
- గర్భిణులు, చిన్నారులు, వృద్ధులకు కష్టాలు
- అధికారులు పక్కాగా నిబంధనలను అమలు చేయాలని ప్రజల వినతి

రేపల్లె రూరల్: ప్రస్తుతం ప్రతి చోటా డీజే బాక్సుల వినియోగం పెరిగిపోతోంది. వ్యక్తుల ఆర్భాటాలు శబ్ద కాలుష్యానికి దారి తీస్తున్నాయి. ఒకరు ఒక డీజే వాడారంటే.. అది చూసి మరొకరు రెండు, ఇంకొకరు మూడు.. ఇలా వాడుతున్నారు. తమ గురించి పది మంది గొప్పగా చెప్పుకోవాలని ఇలా అత్యుత్సాహానికి పోతున్నారు. అధిక సంఖ్యలో డీజేలను వినియోగిస్తూ శబ్ద కాలుష్యానికి కారకులుగా మారుతున్నారు. పైగా ప్రజలకు ఎదురవుతున్న ఇబ్బందులను పట్టించుకోవడం లేదు. శుభకార్యాలు, ర్యాలీలు, ఉత్సవాలు, ప్రచార సభలు.. ఇలా ప్రతిదానికీ డీజే సౌండ్ బాక్స్‌లను వినియోగించడం నేడు సర్వ సాధారణమైంది. ఈ బాక్స్‌ల వినియోగాన్ని నియంత్రించడంపై అధికారులు శ్రద్ధ చూపడం లేదు.

అతి చేస్తే అనర్థాలే

పలువురు యువకులు పట్టణాలలో ద్విచక్రవాహనాలకు సైలెన్సర్‌లు తొలగించి నడపటంతో అధిక శబ్దాలు వెలువడుతున్నాయి. మరికొందరు వాహనాలకు పలురకాల సౌండ్ హారన్‌లను ఏర్పాటు చేసుకుని విచ్చలవిడిగా మోగిస్తూ జనజీవనానికి అసౌకర్యం కలిగిస్తున్నారు. ఇంకొంతమంది తమ వాహనాల సైలెన్సర్‌లకు రబ్బర్లు ఏర్పాటు చేసుకోవటంతో జనసంచార ప్రదేశాలలో విపరీత శబ్దాలను చేస్తూ పైశాచికానందాన్ని పొందుతున్నారు. ద్విచక్రవాహనం నుంచి ఒక్కసారిగా వచ్చే పెద్ద శబ్దంతో వృద్ధులు, చిన్నారులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు.

అమలు కాని ఆదేశాలు

శబ్ద కాలుష్యాన్ని నియంత్రించే దిశగా కోనేరు గోపాలరావు పురపాలక శాఖ మంత్రిగా ఉన్న సమయంలో చేసిన చట్టం క్షేత్రస్థాయిలో అమలు కావటం లేదు. శబ్ద కాలుష్యం నియంత్రణలో భాగంగా పురపాలక సంఘాలలో సున్నిత ప్రాంతాలను గుర్తించి సైలెన్స్ జోన్ బోర్డులను ఏర్పాటు చేయాలని 2011లో ఆదేశాలు జారీ అయ్యాయి. కానీ ఇలాంటి మార్గదర్శకాలు అమలుకు నోచుకోవడం లేదు.



పట్టణంలో వేడుకలకు వినియోగిస్తున్న డీజే సౌండ్ బాక్స్‌లు

నిబంధనలు అమలు చేయాలి



పర్యావరణ నిబంధనలు పట్టణంలో కఠినంగా అమలు చేయాలి. శబ్ద తీవ్రత ఉదయం 6 నుంచి రాత్రి 10 గంటల వరకు 50 డెసిబుల్స్, రాత్రి 10 – ఉదయం 6 గంటల వరకు 40 డెసిబుల్స్ మించరాదని చట్టంలో ఉంది. అధిక శబ్దాలు చేయటంతో వృద్ధులు, గర్భిణులు, చిన్నారులు పడుతున్న ఇబ్బందులు వర్ణనాతీతం. పట్టణంలో సున్నిత ప్రాంతంలో సైలెన్స్ జోన్ బోర్డులను తప్పనిసరిగా ఏర్పాటు చేయాలి

– సీవీ మోహనరావు, పట్టణాభివృద్ధి సంఘం కార్యదర్శి, రేపల్లె

ఆరోగ్యానికి చేటు



శబ్దకాలుష్యంతో అన్నీ అవస్థలే. ఎక్కువగా మానసిక ఒత్తిడికి గురికావటంతోపాటు అనేక రుగ్మతలు తలెత్తే అవకాశం ఉంది. అధిక శబ్దాలు వినటంతో కర్ణభేరి పగిలి వినికిడి శక్తి కోల్పోయే ప్రమాదం ఉంది. దీంతోపాటు నిద్రలేమి సమస్యలు ఎదురవుతాయి. శబ్దాలకు గుండె జబ్బులతో బాధపడేవారు, వృద్ధులు, గర్భిణులు, చిన్నారులు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోంది. సాధ్యమైనంత వరకు శబ్దాలు చేయటం, వినటం తగ్గిస్తే అందరికీ మంచిది.

– డాక్టర్ వసంతం వీరరాఘవయ్య, రేపల్లె

మార్గదర్శకాలు ఇవే..

- బహిరంగ ప్రదేశాల్లో అనుమతులు లేకుండా సభలు, సమావేశాలు నిర్వహించకూడదు. నిర్వహిస్తే 10 డెసిబుల్స్ కంటే మించి శబ్దం చేయకూడదు.
- ప్రైవేటు ప్రదేశాలు (ఇల్లు, హాళ్ల)లో డీజే శబ్దాలు చేయరాదు.
- లిఖితపూర్వక అనుమతి లేకుండా లౌడ్ స్పీకర్లు, సౌండ్ బాక్స్‌లు వాడకూడదు.
- నిషిద్ధ ప్రాంతాలుగా గుర్తించిన ప్రదేశాల్లో సంగీత ధ్వనులు, డ్రమ్స్ కొట్టడం, ఇతర శబ్దాలు చేయరాదు.
- సినిమా థియేటర్‌లలో సైతం 85 డెసిబుల్స్‌కు మించి శబ్దం రాకూడదు.
- వైద్యశాలలు, విద్యాసంస్థలు, దేవాలయాలు, న్యాయస్థానాలకు వంద మీటర్ల పరిధిలోని ప్రాంతాలను నిషిద్ధ ప్రాంతాలుగా పరిగణిస్తారు. ఇక్కడ శబ్దాలు చేయటంపై నిషేధం విధించారు.

రాష్ట్రస్థాయి ఖో ఖో జట్ల ఎంపిక





ఎంపికైన బాలుర, బాలికల జట్లతో అసోసియేషన్ ప్రతినిధులు

జే.పంగులూరు: రాష్ట్రస్థాయి ఖో ఖో జట్లను ఎంపిక చేశారు. ఈ నెల 28 నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు జార్ఖండ్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీలకు సబ్ జూనియర్ విభాగంలో బాలబాలికల జట్ల ఎంపిక పూర్తి చేసినట్లు ఖో ఖో అసోసియేషన్ కార్యదర్శి మేకల సీతారామిరెడ్డి ఆదివారం తెలిపారు. బాపట్ల జిల్లా పంగులూరులోని మాగుంట సుబ్బరామిరెడ్డి, బాచిన నారాయణమ్మ జూనియర్ కళాశాలలో ఈ ఎంపిక ప్రక్రియ చేపట్టినట్లు తెలిపారు. అన్ని జిల్లాల నుంచి 170 మంది పాల్గొన్నారని, ప్రతిభ కనబరిచిన వారిని ఎంపిక చేసినట్లు పేర్కొన్నారు. ముఖ్య అతిథిగా రాష్ట్ర ఖో ఖో అసోసియేషన్ చైర్మన్ బాచిన చెంచుగరటయ్య మాట్లాడుతూ.. అనివార్య కారణాల వల్ల రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్ పోటీలు నిర్వహించలేకపోయినట్లు చెప్పారు. ఎంపికైన క్రీడాకారులకు గ్రామస్తుల సహకారంతో పంగులూరులో ఎస్ఆర్ఆర్ అకాడమీలో శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. జాతీయ స్థాయిలో రాష్ట్ర జట్లు మంచి ప్రతిభ కనబరచాలని ఆయన ఆకాంక్షించారు.

బాలుర రాష్ట్ర జట్టు ఇదే..

ఏ శ్రీనివాసరావు (ప్రకాశం), పీ వెంటేశ్వర్లు (ప్రకాశం), డీ బాజీవలి (ప్రకాశం), ఎస్ భవాని శంకర్ (కృష్ణ), టీ మిట్టు (విశాఖ), డీ రవి (శ్రీకాకుళం), ఎస్ వీరేంద్ర (ఈస్టు గోదావరి), ఆర్ బాలాజీ (కర్నూలు), వీ సాగర్ (ప్రకాశం), ఎం పవన్ (విజయనగరం), పీ జ్యోతిరామ్ (అనంతపురం), సీహెచ్ నారాయణరెడ్డి (ప్రకాశం), బద్రీనాథ్ (చిత్తూరు), బి రాయన్ పాల్ (గుంటూరు), గౌతం (నెల్లూరు).

బాలికల రాష్ట్ర జట్టు ఇదే..

ఆర్ సరస్వతి (శ్రీకాకుళం), ఎస్ భానుప్రియ (ప్రకాశం), ఎం ధనలక్ష్మి (విజయనగరం), కే భవాని (నెల్లూరు), వై భవాని (శ్రీకాకుళం), జీ లక్ష్మి (చిత్తూరు), ఆర్ లలిత దేవి (విశాఖ) కే వైశాలి (ప్రకాశం), డీ యోదిత (కృష్ణ), ఏ స్వప్న (అనంతపురం), వీ శిరీష (కర్నూలు), టీ ప్రియ (ఈస్టు గోదావరి), కే రేణుక (వెస్టు గోదావరి), పీ శివమణి (గుంటూరు), ఎం హర్షిత శ్రీ (కృష్ణ).

గణ వీడ్కోలు

భక్తిశ్రద్ధలతో 61 అడుగుల మట్టి వినాయక విగ్రహం నిమజ్జనం



నిమజ్జనానికి సిద్ధం చేసిన విగ్రహం

సత్తెనపల్లి: పల్నాడు జిల్లా సత్తెనపల్లి పట్టణంలోని శ్రీశ్రీ నగర్ లో శ్రీ సత్య సాయి యువజన సంఘ ఆధ్వర్యంలో సినీ ఆర్ట్ డైరెక్టర్ వీరాంజనేయులు పర్యవేక్షణలో పర్యావరణానికి పెద్దపీట వేస్తూ 61 అడుగుల మట్టి వినాయకుడిని ప్రతిష్ఠించారు. ఈ మట్టి గణపతికి అలంకరించే వస్తువులను సైతం ప్రత్యేకంగా రూపొందించారు. ఎటువంటి రసాయనాలు కలపకుండా కేవలం మట్టి, గడ్డి, కలప వినియోగించారు. తొమ్మిది రోజులపాటు నిత్యం ఉదయం, సాయంత్రం పూజలు అందుకున్న వినాయకుడిని ఆదివారం తొమ్మిదో రోజు భక్తిశ్రద్ధలతో ప్రతిష్ఠించిన చోటే నిమజ్జనం చేశారు. పట్టణ పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

నేత్రపర్వంగా అమరావతి నృత్యోత్సవం



చిన్నారుల నృత్య ప్రదర్శన

నగరంపాలెం: స్థానిక బృందావన్ గార్డెన్స్ శ్రీ వెంకటేశ్వరస్వామి దేవాలయం అన్నమయ్య కళావేదికగా కె.ఆర్.కె.ఎం.మెమోరియల్ అకాడమీ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్ కార్యదర్శి కోకా విజయలక్ష్మి ఆధ్వర్యంలో రెండు రోజులు నిర్వహించనున్న ఎనిమిదో అమరావతి నృత్యోత్సవం -2024 (భారతీయ నాట్యరీతుల సమ్మేళనం) ఆదివారం సాయంత్రం ప్రారంభమైంది. మహా గణపతిం, జతి స్వరం, రామాయణ శబ్దం, ఆనందతాండవమాడే శివుడు అనే అంశాల్ని అకాడమీ విద్యార్థులు హావభావాలతో చక్కగా ప్రదర్శించారు. అనంతరం కర్ణాటక కళారత్న అవార్డు గ్రహీత సత్యనారాయణరాజు ప్రదర్శించిన రామకథ ఆహ్లాదకరంగా సాగింది. ఎమ్మెల్యే గళ్లా మాధవి, ఆడిటర్ రామరాజు శ్రీనివాస్, ఆలయ పాలక మండలి అధ్యక్షులు సీహెచ్. మస్తానయ్య, వీవీఐటీ నంబూరు చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్, సంస్థ సభ్యులు, కళాకారులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

పిచ్చికుక్క స్వైర విహారం

ఎనిమిది మందిని కరిచిన వైనం



పర్చూరు (చినగంజాం): మండలంలోని చెరుకూరు గ్రామంలో శనివారం రాత్రి పిచ్చికుక్క స్వైర విహారం చేసింది. గ్రామానికి చెందిన మేకా శ్రీను శామ్యూల్, సుబ్బారావు, వెంకటయ్య తదితరులతోపాటు ఎనిమిది మందిని తీవ్రంగా గాయపరిచింది. గాయపడిన కొందరికి ప్రైవేటు ఆసుపత్రిలో, మరికొందరికి బాపట్ల ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స అందించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. బయట తిరగాలంటేనే భయంగా ఉందని స్థానికులు అంటున్నారు. అధికారులకు అనేక సార్లు ఫిర్యాదు చేసినా ఫలితం లేదని వాపోయారు. కుక్కల బారి నుంచి తమను కాపాడాలని కోరుతున్నారు.

ఒకే వీధిలోని 7 ఇళ్లలో చోరీకి యత్నం

రక్షణ చర్యలు చేపట్టాలని స్థానికుల వినతి



అద్దంకి రూరల్: అద్దంకి పట్టణంలోని ఒకే వీధిలోని ఏడు గృహాల్లో చోరీకి దొంగలు ప్రయత్నించిన సంఘటన శనివారం అర్ధరాత్రి జరగ్గా.. ఆదివారం వెలుగులోకి వచ్చింది. స్థానికులు తెలిపిన సమాచారం మేరకు... అద్దంకి పట్టణంలోని వాసవీనగర్‌లో మూగులూరి గోపి, అంకమ్మరావు, శబరి మల్లీశ్వరరెడ్డి, మలాది రత్తయ్య, మేదరమెట్ల సీతారామయ్య, నీలం సుబ్బయ్యలు నివాసం ఉంటున్నారు. శనివారం రాత్రి వారు గృహాలకు లోపలి గడియలు పెట్టుకుని నిద్రపోతున్నారు. ఈ క్రమంలో దొంగలు ఇళ్లలోని మెయిన్ డోర్ పక్కన ఉన్న కిటికీల లాకులను తొలగించాక గడియ తెరిచి ప్రవేశించారు. ఎక్కడా నగదు దొరకలేదు. ఓ ఇంట్లో దేవుడి కోసం ముడుపుకట్టి ఉంచిన రూ.10 వేలు మాత్రం దొంగిలించారు. సమాచారం అందుకున్న పోలీసులు వచ్చి పరిస్థితిని పరిశీలించారు. తగిన రక్షణ చర్యలు చేపట్టాలని స్థానికులు కోరారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని యువకుడి మృతి

ఫిరంగిపురం: ఆర్టీసీ బస్సు ఢీకొని యువకుడు మృతి చెందిన సంఘటన శనివారం అర్ధరాత్రి ఫిరంగిపురంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వేములూరిపాడుకు చెందిన కె.నాగరాజు (25) శనివారం రాత్రి ఫిరంగిపురం గ్రామ శివారులోని ఓ హోటల్‌లో బిర్యాని తినేందుకు వచ్చాడు. అనంతరం రోడ్డు దాటుతుండగా విజయవాడ నుంచి కడప వెళుతున్న ఆర్టీసీ బస్సు వేగంగా వచ్చి ఢీకొంది. ఈ సంఘటనలో నాగరాజు అక్కడికక్కడే మృతి చెందాడు. నాగరాజుకు భార్య, కుమారుడు ఉన్నారు. సంఘటనపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వైఎస్సార్ సీపీ శ్రేణులను హింసించడం తగదు

పార్టీ అద్దంకి ఇన్‌చార్జి పానెం చిన హనిమిరెడ్డి



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న చిన హనిమిరెడ్డి

అద్దంకి రూరల్: వైఎస్సార్ సీపీ నాయకులను, కార్యకర్తలను హింసించడమే కూటమి ప్రభుత్వం పనిగా పెట్టుకుందని ఆ పార్టీ అద్దంకి ఇన్‌చార్జి పానెం చిన హనిమిరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇది సరైన పద్ధతి కాదని పేర్కొన్నారు. ఆదివారం స్థానిక పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. మూడు రోజుల క్రితం మండలంలోని ధర్మవరం గ్రామంలో జరిగిన ఘటనలో వైఎస్సార్ సీపీ కార్యకర్తలపై కేసులు పెట్టారని గుర్తుచేశారు. మహిళలను కూడా రాత్రి, పగలు తేడా లేకుండా హింసించడం సరికాదన్నారు. ఇదే విధంగా ప్రభుత్వ వైఖరి కొనసాగితే రానున్న కాలంలో ప్రజలు బుద్ధి చెప్పడం ఖాయమన్నారు. ఇలాంటి సమయాల్లో సంయమనం పాటించాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. మంత్రి గొట్టిపాటి రవికుమార్ కూడా సానుకూల వాతావరణాన్ని నెలకొల్పటానికి కృషి చేయాలన్నారు. తమ కార్యకర్తలకు అన్యాయం జరిగితే చూస్తూ ఊరుకోబోమన్నారు. ధర్మవరం గ్రామ వైఎస్సార్ సీపీ నాయకుడు అవిశెన ప్రభాకరెడ్డికి చెందిన ఆస్తులు ధ్వంసం చేసి.. తిరిగి బాధితులపైనే కేసులు పెట్టడం ఎంతవరకు సమంజసమన్నారు. పోలీసులు ప్రజలకు రక్షణ కల్పించాలేగానీ ఇలా అధికార పార్టీకి కొమ్ముకాయడం సరికాదన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు బీవీ కృష్ణారెడ్డి, ఎల్ రవికుమార్, కొల్లా భువనేశ్వరి, కౌన్సిలర్‌లు గుంజి కోటేశ్వరరావు, జబ్బార్, పరిమి ప్రసాద్, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

యోగా జాతీయ పోటీలకు చందలూరు విద్యార్థులు



ఎంపికైన విద్యార్థులతో పీఈటీ ప్రతిమ

జే.పంగులూరు: జాతీయ స్థాయిలో జరగబోయే యోగా పోటీలకు చందలూరు పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు ఎంపికయ్యారని ఉపాధ్యాయులు తెలిపారు. ఈ సందర్భంగా ఆదివారం ఆ విద్యార్థులను, పీఈటీని అభినందించారు. గత రెండు రోజుల నుంచి విశాఖపట్నంలో యోగా ఫెడరేషన్ ఆఫ్ ఇండియాకు అనుబంధంగా ఉన్న విశాఖ యోగా స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అండర్ -12,14 విభాగంలో పోటీలు జరిగాయి. చందలూరు పాఠశాలలో ఏడో తరగతి చదువుతున్న విద్యార్థులు శృతి, వెంకటేష్ ప్రతిభ కనబరిచారు. దీంతో వారు హిమాచల్‌ప్రదేశ్‌లో జాతీయ స్థాయిలో జరగబోయే పోటీలలో పాల్గొననున్నారు. విద్యార్థులను, పీఈటీ ప్రతిమను ఎస్ఎంసీ చైర్మన్ గొట్టిపాటి హరికృష్ణ, హెచ్ఎం గిరిజ, గ్రామ పెద్దలు పెంట్యాల రామలింగస్వామి, అడ్డగడ వెంకట సుబ్బయ్య, అజిత్ కుమార్ చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధి వడ్డవల్లి వీరనారాయణ అభినందించారు.

సందడిగా పూర్వ విద్యార్థుల కలయిక



ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

ఇంకొల్లు (చినగంజాం): జీవితంలో ప్రతి ఒక్కరికీ తీపి గుర్తులుగా మిగిలిపోయేది చిన్ననాటి జ్ఞాపకాలే. అలా గుర్తు చేసుకుంటే ఎంతో ఆనందం కలగక మానదు. ఇంకొల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యనభ్యసించిన పూర్వ విద్యార్థులు నాలుగు దశాబ్దాల సుదీర్ఘ విరామం తరువాత కలుసుకుని అదే అనుభూతిని ఆస్వాదించారు. 1980–81లో పాఠశాలలో 10వ తరగతి పూర్తి చేసుకున్న వారు వేర్వేరు చోట్ల ఉన్నా ఆదివారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఆత్మీయ సమ్మేళనంలో ఒక్కటయ్యారు. ఆత్మీయ కౌగిలింతలు, షేక్ హ్యాండ్‌లు, ఆనందబాష్పాలతో తమ బాల్య జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. అమ్మమ్మలు, తాతయ్యలుగా మారిన వారంతా ఒక్కసారిగా వయస్సును సైతం మరిచిపోయి ఆనంద డోలికల్లో తేలియాడారు. కాసేపు విద్యార్థులుగా మారి తాము చదువుకొన్న పరిసరాలు చూసి ఆనందించారు. కలిసి భోజనం చేశారు. ముఖ్య అతిథులుగా ఇంకొల్లు ఎంఈఓ బీ అజయ్‌బాబు, ఏ శ్రీనివాసరావు, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఉపాధ్యాయులు కాశీ విశ్వనాథం, సత్యనారాయణ, బ్రహ్మం, వల్లీలను సన్మానించారు. ఈ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమాన్ని షేక్ మస్తాన్ వలి, చుండూరి కృష్ణ నిర్వహించారు. ఎన్ఆర్ఐలు కరి సుబ్బారావు, తూమాటి శ్రీనివాసరావు, పొన్నగంటి సుధారాణి పాల్గొన్నారు. సన్మాన కమిటీ తరపున కొత్త రామయ్య, కరి రాంబాబు, ఆర్ఐ లక్ష్మయ్య, మిగతా 80 మంది పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

కరాటే పోటీల్లో మంగళగిరి విద్యార్థులకు పతకాలు



మంగళగిరి: ఇటీవల ఏలూరులో జరిగిన నేషనల్ కరాటే ఛాంపియన్ షిప్ పోటీలలో మంగళగిరి ఎంఎంకే స్టేడియం విద్యార్థులు ప్రతిభ కనపరచి పతకాలు సాధించారు. అండర్– 19 బాలుర విభాగంలో జె.మోహన్ సాయి బంగారు పతకం, అండర్ – 14 విభాగంలో కె. మహర్షిసాయి బంగారు పతకం, కె. నీరజ్ కుమార్ బ్రాంజ్ మెడల్ సాధించారు. అండర్–12 విభాగంలో డి. మోనిష్కతన్ సిల్వర్ మెడల్, కటాస్ విభాగం అండర్– 17 బాలుర విభాగంలో వి. శ్రీరామ్ బంగారు పతకం, బాలికల అండర్– 12 విభాగంలో ఎస్. హేమావతి బంగారు పతకం, సుమ బ్రాంజ్ మెడల్ సాధించారు. విద్యార్థులను స్టేడియం ప్రతినిధులు, కోచ్ డి. ప్రభాకర్ అభినందించారు.

ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులో డీఎస్పీ విచారణ



పెదకూరపాడు: మండలంలోని లగడపాడు గ్రామంలో వినాయక శోభాయాత్ర సందర్భంగా ఎస్సీ వర్గీయులపై అగ్రకుల వర్గీయులు జరిపిన దాడికి సంబంధించి నమోదైన ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుపై సత్తెనపల్లి డీఎస్పీ గురునాథ్‌బాబు ఆదివారం గ్రామంలో విచారణ చేపట్టారు. ఈ నెల 9వ తేదీన వినాయకుని శోభాయాత్ర సందర్భంగా ఎస్సీ కులానికి చెందిన ఎర్రగొల్ల నరసింహరావు, పల్లం ఏసుపాదంపై అగ్రవర్ణాలకు చెందిన వ్యక్తులు దాడి చేశారు. ఈ సందర్భంగా బాధితుల ఫిర్యాదు మేరకు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశారు. బాధితులు, సాక్షులను విచారించారు. వారి వెంట ఎస్ఐ బాలూనాయక్ తదితరులు ఉన్నారు.

వ్యవసాయ కళాశాల పూర్వ విద్యార్థుల సమ్మేళనం



కార్యక్రమంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

బాపట్ల: బాపట్లలోని వ్యవసాయ కళాశాలలో 1974 బ్యాచ్ విద్యార్థులు ఆదివారం సంబరాలు నిర్వహించారు. దాదాపు 60 మంది పూర్వవిద్యార్థులు హాజరై ఆనాటి మధురస్మృతులను గుర్తుచేసుకున్నారు. విలువైన అనుభవాలను పంచుకున్నారు. దీనికి సహకరించిన కళాశాల డీన్ డాక్టరు ప్రసూనరాణిని అభినందించారు. కళాశాల విద్యార్థులకు అవసరమైన తరగతి గదుల నిర్మాణానికి సహకారం అందిస్తామని తెలిపారు. ఆ మేరకు మయూరవల్లి ఏసీ కొనేందుకు నగదు ఇవ్వడానికి ముందుకొచ్చారు. ఒంగోలులోని విద్యోన్నతి ఫౌండేషన్ నుంచి సాయం అందిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో పూర్వవిద్యార్థులైన ప్రభుత్వ రిటైర్డు చీఫ్ సెక్రటరీ అజేయ కల్లాం, రిటైర్డు ఆటవీశాఖ అధికారి ఎం.సుధాకర్, జీ.వి.నాగేశ్వరరావు, అశోక్‌రాణి, చక్రపాణి, కాశీ విశ్వంత్, సన్యాసిరావు, ఏవీ రంగారెడ్డి, డి.వీరనారాయణ, జయంతి వెంకటేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

అప్సా డెమోక్రటిక్ గుంటూరు జిల్లా కార్యవర్గం



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ ఏ.ఎస్. రామకృష్ణ

గుంటూరు ఎడ్యుకేషన్: ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ డెమోక్రటిక్ (అప్సా డెమోక్రటిక్) సర్వసభ్య సమావేశాన్ని ఆదివారం బ్రాడీపేటలోని మాజేటి గురవయ్య హైస్కూల్లో ఆడిటోరియంలో నిర్వహించారు. ఇందులో గుంటూరు జిల్లా శాఖకు కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జిల్లా గౌరవాధ్యక్షునిగా సాదినేని శ్రీనివాసరావు (భారవి స్కూల్), అధ్యక్షుడిగా చిన్నం శ్రీనివాసరావు (ఎస్ఆర్ఎస్ రెయిన్‌బో గ్రూప్ ఆఫ్ స్కూల్స్), కార్యదర్శిగా డాక్టర్ కోనూరు జయకుమార్(ఇంటెల్ హైస్కూల్), ఉపాధ్యక్షుడిగా పఠాన్ ముసారత్ (రత్నం స్కూల్), సంయుక్త కార్యదర్శిగా నక్కా జార్జ్‌బాబు (ఒలీవ్ స్కూల్), కార్యనిర్వాహక సభ్యులుగా రంగాచారి (సిమ్స్ మై స్కూల్), శివ శంకర్ (విజేత స్కూల్)తో పాటు మరి కొంతమంది సభ్యుల్ని తెనాలి, తాడికొండ, మంగళగిరి, పొన్నూరు, ప్రత్తిపాడు, గుంటూరు వెస్ట్, గుంటూరు ఈస్ట్, నియోజకవర్గాల నుంచి ఎన్నుకున్నారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న మాజీ ఎమ్మెల్సీ రామకృష్ణ మాట్లాడుతూ ప్రైవేటు పాఠశాలలు అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. అప్సా డెమోక్రటిక్ వ్యవస్థాపక చైర్మన్ గొల్లపూడి మోహన్‌రావు మాట్లాడుతూ తక్కువ వ్యవధిలో జిల్లాలో నియోజకవర్గాల వారీగా పెద్దసంఖ్యలో సభ్యులుగా చేరడం శుభ పరిణామమని తెలిపారు. కార్యక్రమంలో ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు మల్లెల శ్రీనివాసరావు, మల్లికార్జునరెడ్డి (మైలవరం), మన్నవ అప్పాజీ (మంగళగిరి), చిరుమామిళ్ల రాము (నరసరావుపేట), ఆక్స్‌ఫర్డ్ కాలేజీ డీజీఎం విడదల శేషగిరిరావు పాల్గొన్నారు.

భరత జాతి ముద్దుబిడ్డ విశ్వేశ్వరయ్య



విశ్వేశ్వరయ్య విగ్రహం వద్ద అధికారులతో కలిసి నివాళులర్పిస్తున్న ఎస్ఈ కె.వెంకటరమణ

సత్రశాల(రెంటచింతల): ఇంజినీరింగ్ రంగంలో అసాధారణ ప్రతిభతో అత్యున్నత శిఖరాలను అధిరోహించి మన దేశ ఖ్యాతిని నలుదిక్కులకు చాటిన మోక్షగుండం విశ్వేశ్వరయ్య భారత జాతి గర్వించదగ్గ ముద్దు బిడ్డ అని నాగార్జునసాగర్ టెయిల్ పాండ్ విద్యుత్ ప్రాజెక్ట్ ఎస్ఈ కె.వెంకటరమణ అన్నారు. ఆదివారం మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతిని పురస్కరించుకుని ప్రాజెక్ట్ ఆవరణలోని విశ్వేశ్వరయ్య విగ్రహానికి ఆయన పూలమాలలు వేసి నివాళులర్పించి మాట్లాడారు. 1861 సెప్టెంబర్ 15న జన్మించిన విశ్వేశ్వరయ్య జన్మదినాన్ని పురస్కరించుకుని ప్రతి ఏటా దేశ వ్యాప్తంగా ఇంజినీర్స్‌డే జరుపుకోవడం ఆనవాయితీగా వస్తుందన్నారు. జలాశయాల నిర్మాతగా, ఆర్థికవేత్తగా ప్రపంచ వ్యాప్తంగా శాశ్వత కీర్తిని గడించిన డా.విశ్వేశ్వరయ్యను భారత ప్రభుత్వం 1955 సం.లో భారత రత్నా పురస్కారం తోను, బ్రిటీష్‌ప్రభుత్వం అత్యుత్తమ పౌరపురస్కారమైన బ్రిటీష్ నైట్‌హుడ్‌గా సన్మానించిందన్నారు. ఏఈఈలు ఎస్.జయపాల్, బి.కాసులు, స్పెషల్ ఫోర్స్ సిబ్బంది, కాంట్రాక్ట్ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

వాహనాల ధ్వంసంపై కేసు

మార్టూరు: పాతకక్షల నేపథ్యంలో ఓ స్టోన్ క్రషర్ వద్ద కొందరు వ్యక్తులు దాడికి తెగబడి కార్యాలయం అద్దాలు ఎనిమిది వాహనాలను ధ్వంసం చేసిన ఘటనపై కేసు నమోదు చేసినట్లు మార్టూరు సీఐ ఎం.శేషగిరిరావు తెలిపారు. సీఐ వివరాల మేరకు.. అద్దంకి మండలం ధర్మవరం గ్రామంలో వినాయక నిమజ్జనం సందర్భంగా టీడీపీ, వైఎస్సార్ సీపీ వర్గీయుల మధ్య ఘర్షణ జరిగిన విషయం తెలిసిందే. అందులో భాగంగా ధర్మవరం గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు ప్రభాకరరెడ్డికి చెందిన మార్టూరు మండలం జంగమహేశ్వరపురం అగ్రహారంలో గల స్టోన్ క్రషర్ వద్దకు కొంతమంది టీడీపీకి చెందిన వ్యక్తులు వెళ్లి దాడికి పాల్పడ్డారు. క్రషర్ వద్ద నిలిపి ఉంచిన ఆరు టిప్పర్లు, ఒక ట్రాక్టర్‌తో పాటు జేసీబీలను తరలించే మరో వాహనాన్ని ధ్వంసం చేసి వాటిని తగలబెట్టారు. కార్యాలయ అద్దాలు, లోపలి సామగ్రి సైతం ధ్వంసం చేశారు. మొత్తం సుమారు రూ.60 లక్షలకు పైగా ఆస్తి నష్టం వాటిల్లినట్లు బాధితుడు ప్రభాకర రెడ్డి తెలిపారు. క్రషర్ గుమస్తా జయవరపు వెంకట సుబ్బారావు ఇచ్చిన ఫిర్యాదుపై బోళ్ల వెంకటేశ్వర్లు, పచ్చవ శ్రీనివాసరావు, పచ్చవ లక్ష్మీనారాయణ, చాగంటి వీరాంజి మరి కొంతమందిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

నేడు బ్రాహ్మణ మహా సంఘం జిల్లా సమావేశం

అమరావతి: అఖిల భారతీయ బ్రాహ్మణ మహా సంఘ సమావేశం సోమవారం స్థానిక యోగాశ్రమంలో నిర్వహిస్తున్నట్లు సంఘ ప్రతినిధులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం ఉదయం స్థానిక అమరేశ్వర స్వామి దేవస్థానంలో మహన్యాస పూర్వక రుద్రాభిషేకం తదనంతరం యోగాశ్రమంలో సంఘం పల్నాడు జిల్లా అధ్యక్షుడిగా ఎంపికైన అమరావతి క్షేత్ర పురోహితుడు కౌశిక ప్రసాదశర్మతో పాటుగా కార్యవర్గ సభ్యుల ప్రమాణ స్వీకార మహోత్సవం జరుగుతుందని తెలిపారు. ఈకార్యక్రమానికి బ్రాహ్మణసోదరులందరూ హాజరవ్వాలని కోరారు.

బీసీ వర్గీయులపై టీడీపీ దాడులు దారుణం

- బాధ్యులను వెంటనే అరెస్టు చేసి కఠినంగా శిక్షించండి
- బాధితుడు సుబ్బారావును పరామర్శించిన డాక్టర్ గోపిరెడ్డి



బాధితుడి ఒంటిపై గాయాలను పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి

నరసరావుపేట: మండలంలోని యలమంద గ్రామంలో బీసీ వర్గీయులపై టీడీపీ నాయకులు చేస్తున్న దాడులను నిలిపివేయించి దాడులకు పాల్పడుతున్న వారిని వెంటనే అరెస్టుచేసి కఠినంగా శిక్షించాలని మాజీ శాసనసభ్యుడు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. ఆదివారం ప్రభుత్వ వైద్యశాలలో టీడీపీ వర్గీయుల దాడిలో గాయపడి చికిత్స పొందుతున్న నూతలపాటి సుబ్బారావును పరామర్శించారు. జరిగిన విషయాన్ని బాధితుడు, ఆయన సోదరి నాగేంద్రంను అడిగి తెలుసుకున్నారు. బాధితుడి చికిత్సపై డాక్టర్లకు పలు సూచనలు చేశారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ యలమంద గ్రామంలో గత కొన్నిరోజులుగా బీసీ కులస్తులపై జరుగుతున్న దాడులు అమానుషమని అన్నారు. ఇప్పటికే యాదవులు, వడ్డెర్లపై దాడిచేసి గ్రామం నుంచి తరిమివేశారన్నారు. ఇప్పుడు రజక కులస్తుల వంతు వచ్చిందన్నారు. కేవలం గత ఎన్నికలలో వైఎస్సార్ సీపీకి ఓటేశాడనే ఒకే ఒక కారణంతో సుబ్బారావును దినేష్, మౌలాలి అనే ఇద్దరు వ్యక్తులు అపహరించి రాడ్లు, కర్రలతో శరీరమంతా దారుణంగా కొట్టారని అన్నారు. ఎన్నికల ఫలితాల అనంతరం వారి వేధింపులు భరించలేక సుమారు 30 కుటుంబాలు ఊరు వదిలిపెట్టి వివిధ ప్రదేశాల్లో బతుకుతున్నారన్నారు. వాళ్ళని పట్టుకొచ్చి మరీ కొట్టడం దారుణమైన విషయమని అన్నారు. బాధితుడి సోదరి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదుచేసి పోలీసులను తీసుకొని వెళితే పోలీసుల సమక్షంలోనే తిరిగి ఈ సుబ్బారావుపై టీడీపీ వర్గీయులు దారుణంగా కొట్టారని అన్నారు. రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగం నడుస్తుందన్నారు. ఎన్నికల వాగ్దానాలైన సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయకపోగా, హత్య రాజకీయాలతో కాలక్షేపం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బాధిత వ్యక్తి తమ్ముడు శ్రీకాంత్ అనే వ్యక్తి ఇంటిపై కూడా దాడి చేశారని, ఇతను చేసిన పాపం వలంటీర్‌గా పనిచేయటమేనన్నారు. భవిష్యత్తులో ఇటువంటి దాడులు జరగకుండా జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు చూడాలని, యలమంద గ్రామంలో ఊరు వదిలిపెట్టి వెళ్లిపోయిన వారిని ఊరిలోకి తీసుకొచ్చేందుకు ఎస్పీ చొరవ చూపించాలని కోరారు. బాధితుడిపై దాడి చేసిన వారిని వెంటనే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. నాయకులు ఎం.శ్రీనివాసరావు, పచ్చవ రవీంద్ర, కురుగుంట్ల శ్రీనివాసరెడ్డి, గ్రామ నాయకులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకూ ఆటలు అవసరం

యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు నక్కా వెంకటేశ్వర్లు



మాట్లాడుతున్న యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు నక్కా వెంకటేశ్వర్లు



చెస్ ఆడుతున్న ఉపాధ్యాయినులు



పరుగు పందెంలో ఉపాధ్యాయులు

గుంటూరు ఎడ్యుకేషన్: ఉపాధ్యాయులకూ ఆటలు, సాంస్కృతిక నైపుణ్యాలు అవసరమని యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు నక్కా వెంకటేశ్వర్లు అన్నారు. యూటీఎఫ్ స్వర్ణోత్సవాల సందర్భంగా సంఘ జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఆదివారం పిచ్చుకలగుంట, బీఆర్ స్టేడియాల్లో ఉపాధ్యాయులకు క్రీడా, సాంస్కృతిక పోటీలు నిర్వహించారు. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం కోసం పోరాటాలు, ప్రభుత్వ పాఠశాలల పరిరక్షణకే పరిమితం కాకుండా ఉపాధ్యాయుల్లో అంతర్లీనంగా ఉన్న సామర్థ్యాలను వెలికి తీయడానికి యూటీఎఫ్ కృషి చేస్తోందని చెప్పారు. ఇందులో భాగంగా సంఘం స్థాపించి 50 ఏళ్లు అవుతున్న సందర్భంగా సాంస్కృతిక , ఆటల పోటీలు రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇక్కడ గెలుపొందిన అందరికీ డిసెంబర్‌లో జరగనున్న స్వర్ణోత్సవాల్లో బహుమతి ప్రదానం ఉంటుందని పేర్కొన్నారు. అనంతరం యూటీఎఫ్ రాష్ట్ర సహాధ్యక్షులు ఏ.ఎన్. కుసుమకుమారి మాట్లాడుతూ.. ఉపాధ్యాయులు బోధనకే పరిమితం కాకూడదని పేర్కొన్నారు. అన్ని రంగాల్లో విద్యార్థుల సమగ్రాభివృద్ధికి తమవంతుగా తగిన కృషి చేయాలని తెలిపారు. యూటీఎఫ్ రాష్ట్ర ప్రచురణల విభాగ చైర్మన్ ఎం.హనుమంతరావు మాట్లాడుతూ.. ఎందరో అమరుల త్యాగాల ఫలితంగా యూటీఎఫ్ ఆవిర్భవించిందని గుర్తుచేశారు. ప్రభుత్వ విద్యారంగాన్ని కాపాడుకునే కర్తవ్యాన్ని ఉపాధ్యాయులు అందరూ స్వీకరించాలని సూచించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.కళాధర్ మాట్లాడుతూ యూటీఎఫ్ విద్యారంగంతో పాటు సామాజిక స్పృహతోనూ పనిచేస్తోందని తెలిపారు. కోవిడ్, వరదలు వంటి ప్రకృతి వైపరీత్యాల సమయంలో ప్రజలకు అండగా నిలిచి, సేవా కార్యక్రమాలను నిర్వహించామని తెలిపారు. కార్యక్రమంలో సంఘ జిల్లా సహాధ్యక్షురాలు ఏ.ఎల్. శివ పార్వతి, జిల్లా కోశాధికారి ఎండీ. దౌలా, జిల్లా కార్యదర్శులు సీహెచ్. ఆదినారాయణ, కె.సాంబశివరావు, జి.వెంకటేశ్వర్లు, యు.రాజశేఖర్‌రావు, ఎం.గోవిందయ్య, టి.ఆంజనేయులు, ఏ.శ్రీనివాసరావు, జి. ధనలక్ష్మి, కె. కేదార్‌నాథ్, ఎం.కోటిరెడ్డి, కె.ప్రేమ్‌కుమార్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని ఇద్దరు దుర్మరణం

నాదెండ్ల: కారు టైరు పంక్చరవటంతో జాతీయ రహదారి పక్కన కారును నిలిపి టైరు మార్చుతుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొని ఇరువురు దుర్మరణం పాలైన సంఘటన యడ్లపాడు మండలం తిమ్మాపురం గ్రామ పరిధిలో తిరుమల స్పిన్నింగ్ మిల్లు సమీపంలో ఆదివారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. ఎస్ఐ బాలకృష్ణ తెలిపిన వివరాల మేరకు ఏలూరు జిల్లా నిడమర్రు గ్రామానికి చెందిన వడల కృష్ణ (31), రవికిషోర్ (25) ఇరువురూ కారు డ్రైవర్లుగా పనిచేస్తుంటారు. కాకినాడలోని ఫిష్ హేచరీల నుంచి రొయ్యల శ్యాంపిల్స్‌ను తీసుకుని ఏపీ39 బీఎం 7126 నంబరు గల మారుతీ ఎర్టిగా కారులో నెల్లూరు వెళ్లారు. తిరిగి ఏలూరుకు వెళ్లే క్రమంలో తిమ్మాపురం వద్దకు వచ్చేసరికి ఆదివారం తెల్లవారుజామున కారు వెనుక టైరు పంక్చరైంది. దీంతో కారును రహదారి పక్కన నిలిపి టైరును మారుస్తున్నారు. అదేసమయంలో గుర్తుతెలియని వాహనం ఢీకొంది. దీంతో వడల కృష్ణ అక్కడికక్కడే మృతి చెందగా, రవికిషోర్ తీవ్ర గాయాలపాలయ్యాడు. 108 సాయంతో చిలకలూరిపేట ప్రభుత్వాసుపత్రిలో చేర్చగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఢీకొన్న వాహనాన్ని గుర్తించేందుకు పోలీసులు హైవేపై ఉన్న సీసీ కేమేరాల ఫుటేజీని పరిశీలిస్తున్నారు.

బైక్‌లు ఢీ.. యువకుడి మృతి

ప్రత్తిపాడు: ఎదురెదురుగా వస్తున్న రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్న ఘటనలో యువకుడు దుర్మరణం చెందిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. ప్రత్తిపాడుకు చెందిన నుదురుపాటి ప్రకాష్ (21) ఆదివారం రాత్రి ప్రత్తిపాడు వైపు నుంచి గుంటూరుకు ద్విచక్ర వాహనంపై వెళుతున్నాడు. అదే సమయంలో గుంటూరు వైపు నుంచి పర్చూరు వైపు మరో ద్విచక్ర వాహనం వస్తోంది. గుంటూరు–పర్చూరు పాత మద్రాసు రోడ్డులో తిక్కిరెడ్డిపాలెం సమీపంలో ఒకదానినొకటి ఢీకొన్నాయి. ఈ ఘటనలో స్థానిక ఎస్సీ కాలనీకి చెందిన ప్రకాష్‌కు తీవ్ర రక్తస్రావం కావడంతో ఘటనా స్థలిలోనే మృతి చెందాడు.